# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-04-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు తమిళనాడులో పర్యటించనున్నారు.**

2. **దేశ వ్యాప్తంగా ఈ రోజు శ్రీ రామ నవమి పర్వదినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ప్రముఖ పుణ్య క్షేత్రం భద్రాచలంలో శ్రీ సీతారాముల కళ్యాణానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.**

3. **రాజధాని అమరావతి నిర్మాణం కోసం మిగులు భూముల ద్వారా రుణాలు సమీకరించేందుకు సీఆర్డీఏ కమిషనర్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.**

4. **హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల కేసులపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు.**

5. **టిడ్కో ఇళ్ల పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు తమిళనాడులో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా తమిళనాడులోని రామనాథపురం జిల్లాలో 535 కోట్ల రూపాయలతో అధునాతన సాంకేతిక విధానంతో నూతనంగా నిర్మించిన పాంబన్ రైలు వంతెనను ప్రధానమంత్రి జాతికి అంకితం చేశారు. అనంతరం రామేశ్వర ఆలయాన్ని సందర్శించి జ్యోతిర్లింగాల వద్ద పూజలు నిర్వహిస్తారు. ఈ మధ్యాహ్నం జరిగే బహిరంగ సభలో పాల్గొని 8 వేల 300 కోట్ల రూపాయల విలువైన నేషనల్ హైవే ప్రాజెక్టులకు శంకుస్థాపన, పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు చేస్తారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

--------------------------

తెలంగాణాలోని భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈరోజు జరగనున్న సీతా రాముల కల్యాణానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి... స్వామి వారి కళ్యాణోత్సవాన్ని కుటుంబంతో కలిసి తిలకించనున్నారు. ఈ మహోత్సవానికి.. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం మిథిలా స్టేడియాన్ని..24 సెక్టార్లుగా విభజించారు. మంచినీరు, మజ్జిగ సిద్ధం చేశారు. గోదావరి వద్ద పుణ్య స్థానాలు చేసే భక్తుల కోసం నది లోపలికి వెళ్లకుండా....... కంచెను ఏర్పాటు చేశారు.

.... కాగా వైఎస్సార్ కడప జిల్లాలోని ఒంటిమిట్ట శ్రీ కోదండరాముడి శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలకు నిన్న అంకురార్పణ జరిగింది. ఈనెల 15వ తేదీ వరకూ 10 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలలో భాగంగా ఈరోజు ధ్వజారోహణం, 10వ తేదీన గరుడసేవ, 11వ తేదీన సీతారాముల కల్యాణం జరగనుందని ఆలయ అధికారులు తెలిపారు. ఈనెల 11న రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం కోసం మిగులు భూముల ద్వారా రుణాలు తీసుకునేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాదికార సంస్థ కమిషనర్‌కు అనుమతిస్తూ సీఆర్డీఏ నిర్ణయం తీసుకుంది. నిన్న ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసంలో సీఆర్డీఏ 46వ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు అధికారాలు తెలిపారు. అమరావతిలో రూ.62 వేల కోట్ల విలువైన పనులు చేసేందుకు దశలవారీగా టెండర్లు పిలుస్తున్నారు. మిగిలిన పనులు చేపట్టేందుకు నిధులను వివిధ ఆర్థిక సంస్థల ద్వారా సేకరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అసెంబ్లీ, హైకోర్టు భవనాల నిర్మాణానికి పిలిచిన టెండర్లలో ఎల్1గా నిలిచిన సంస్థలకు ఎల్‌ఓఏలు ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు.

---------------------------

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో టిడ్కో ఇళ్లు పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేందుకు సిద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అధికారులు ఆదేశించారు. పాలకొల్లులో టిడ్కో ఇళ్ళ వద్ద వివిధ శాఖల అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత మూడు నెలలుగా టిడ్కో ఇళ్లపై తరచూ సమావేశాలు నిర్వహించి అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నా మని తెలియజేస్తూ...

వాయిస్.. 35 సెకన్లు

---------------------------

హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల కేసులపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వీడియోలతో గందరగోళం సృష్టించిన విషయాన్ని సుప్రీంకోర్టుకు వివరించి.. విచారణకు ఆదేశించేలా కోరాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇలాంటి జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలో సైబర్ క్రైమ్ విభాగాన్ని బలోపేతం చేయాలని తెలిపారు. ఏఐ నకిలీ వీడియోలు, ఫోటోలను పసిగట్టేందుకు... అధునాతన ఫోరెన్సిక్ హార్డ్ వేర్, సాఫ్ట్ వేర్ టూల్స్ వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మొదటి దశను డిసెంబరు లోపలే పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. నీటిపారుదలశాఖ అధికారులతో ఉత్తమ్‌కుమార్ రెడ్డి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నార్లాపూర్, ఏదుల జలాశయాల మధ్య రెండో ప్యాకేజీని త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.

కాలువల పనులను వచ్చే అక్టోబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. జూరాల ప్రాజెక్టులో పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు.

----------------------------

రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పుగోదావరి నిడదవోలు నియోజకవర్గంలోని మోర్తా గ్రామంలో నిన్న జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడుతో కలిసి ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రైతులకు తాము పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర కంటే అధిక ధర లభిస్తే నచ్చిన చోట అమ్ముకోవచ్చని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్ లో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని 2 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 2.50 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచడం జరిగిందని వివరిస్తూ....

వాయిస్: 30 సెకన్లు

----------------------------

తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఎదుట 86 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో... కొత్తగూడెం జిల్లాకు చెందిన వారు 81 మంది, ములుగు జిల్లాకు చెందిన వారు ఐదుగురు ఉన్నట్లు ఐజీ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి వచ్చే పునరావాసం... అన్ని ప్రోత్సాహకాలు వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. గత నెలలో 64 మంది నక్సల్స్ లొంగిపోగా... తాజాగా మరో 86 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారని ఆయన తెలియజేస్తూ...

వాయిస్ 25 సెకన్లు

----------------------------

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ లో వాతావరణ పరిస్థితిని గురించి వాతావరణ శాఖ అధికారి ఎం వెంకటరావ్ తెలియజేస్తూ,

..వాయిస్ 27 సెకన్లు....

మరోవైపు తెలంగాణలోనూ ఈ రోజు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. గంటకు 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉందని వెల్లడించింది.

=====================